

హెల్మెట్ వాడితే 55 శాతం ప్రమాదాలు నివారణ

బ్రోచర్‌ను ఆవిష్కరించిన డిటిసి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రోడ్డు ప్రమాదాలు అరికట్టాలంటే కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, తద్వారా 55 శాతం ప్రమాదాలు నివారించవచ్చునని జిల్లా రవాణా అధికారి టి.ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం శ్రీ విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో హెల్మెట్ వినియోగ అవగాహనా బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ హెల్మెట్ వినియోగంపై వారంలో రెండురోజులు అవగాహనా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో రవాణాశాఖ సిబ్బంది కెఎస్ఎన్.ప్రసాద్, సిహెచ్.వెంకటరమణ, ఎ.రవికుమార్, ఎస్‌వి.సత్యనారాయణ, పులపర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తిరుగుబాటు తుస్..!

జెడ్‌పి చైర్మన్‌పై పారని వైసిపి జెడ్‌పిటిసిల పాచిక

పద్మశ్రీపై అనర్హత వేటు కోసం ప్రత్యేక సమావేశం

మొత్తం 47 మంది జెడ్‌పిటిసిలకుగాను 38 మంది హాజరు

ఏదో నామకహా అన్నట్లు మాట్లాడి వదిలేసిన వైసిపి సభ్యులు

పార్టీ ఫిరాయింపుల చట్టం స్థానిక సంస్థలకు వర్తించదన్న సిఇఒ

గంటలోపే ముగిసిన ప్రత్యేక సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీపై అనర్హత వేటు వేయాలని, అందుకోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని పట్టుబట్టిన వైసిపి జెడ్‌పిటిసిలు తీరా సమావేశంలో మాత్రం పెద్దగా మాట్లాడకుండానే ముగించేసిన పరిస్థితి నెలకొంది. అనర్హత వేటు చట్టప్రకారం సాధ్యం కాదని అధికారులు చెప్పడంతో గంటలోపే సమావేశం ముగిసిపోయింది. దీంతో దాదాపు రెండు నెలలుగా ఉత్కంఠ రేపుతున్న జిల్లా పరిషత్ ఛైరపర్సన్ అంశం ఎటువంటి హడావుడీ లేకుండా సద్దుమణిగింది. దీంతో వైసిపి సభ్యులు ప్రత్యేక సమావేశం కోసం ఎందుకు పట్టుబట్టారో.. సభ్యులంతా ఎందుకు మాట్లాడలేదో ఏఒక్కరికీ అర్థంకాని పరిస్థితి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 48 జెడ్‌పిటిసి స్థానాలు ఉన్నాయి. 2021లో జరిగిన జిల్లా పరిషత్ ఎన్నికల్లో వైసిపి 48కుగాను 46 చోట్ల గెలుపొందింది. రెండుచోట్ల జనసేన, టిడిపి గెలుపొందాయి. దీంతో జెడ్‌పి ఛైర్మన్‌గా వైసిపి నుంచి కవురు శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆయన 2023లో స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల్లో పోటీ చేసి గెలవడంతో జెడ్‌పి ఛైర్మన్ పదవి ఖాళీ అయ్యింది. దీంతో వైసిపి పెదపాడు జెడ్‌పిటిసి గంటా పద్మశ్రీని ఛైరపర్సన్‌గా వైసిపి ఎంపిక చేసింది. 2023 జూన్ ఎనిమిదో తేదీన పద్మశ్రీ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ఏడాది మే నెలలో జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం గెలుపొందింది. దీంతో జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ దంపతులు టిడిపిలో చేరిపోయారు. దీన్ని వైసిపి సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆమె జెడ్‌పిటిసి పదవిపై అనర్హత వేటు వేయాలని గడిచిన సెప్టెంబర్ ఎనిమిదో తేదీన జెడ్‌పి సిఇఒకు వినతిపత్రం ఇచ్చారు. అధికారులు స్పందించకపోవడంతో నవంబర్ ఎనిమిదిన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశాలను బహిష్కరించారు. దీంతో నవంబర్ 11న జిల్లా పరిషత్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు జెడ్‌పి అధికారులు ప్రకటించారు. అయితే చివరి నిముషంలో ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ నేపథ్యంలో సమావేశం రద్దు చేసి, ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ

ప్రత్యేక సమావేశం జరిగిందిలా..

వైసిపి జెడ్‌పిటిసిల డిమాండ్ మేరకు జిల్లా పరిషత్ ప్రత్యేక సమావేశం ఈ నెల 21వ తేదీ ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేస్తున్నామని, మధ్యాహ్నం రెండు గంటల తర్వాత సర్వసభ్య సమావేశం జరుగుతుందని జెడ్‌పి సిఇఒ ప్రకటించారు. ఆ మేరకు శనివారం ఉదయం పది గంటలకు ప్రత్యేక సమావేశం ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాలో 48 మంది జెడ్‌పిటిసి సభ్యులకుగాను యలమంచిలి ఖాళీ అయ్యింది. ఇంకా 47 మంది సభ్యులు ఉండగా ప్రత్యేక సమావేశానికి 38 మంది హాజరయ్యారు. వీరిలో ఇద్దరు టిడిపి, జనసేన, మిగిలిన 36 మంది వైసిపి సభ్యులే. తొలుత జెడ్‌పి ఇన్‌ఛార్జి సిఇఒ ఆర్.విజయరాజు మాట్లాడుతూ వైసిపి నుంచి గెలిచి టిడిపిలో చేరిన జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీపై అనర్హత వేటు వేయాలంటూ ఇచ్చిన నోటీసుపై సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే అంశం ఎజెండాగా నిర్ణయించినట్లు తెలిపారు. తొలుత ఛైర్‌పర్సన్ పద్మశ్రీ మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలకు అనేక హామీలు ఇచ్చామని, ప్రజలకు మేలు చేయడానికి, అభివృద్ధి కోసమే పార్టీ మారానని చెప్పారు. అందరం కలిసిమెలిసి పని చేసి ప్రజలకిచ్చిన హామీలన్నీ నెరవేరుద్దామన్నారు. వైసిపి పోడూరు జెడ్‌పిటిసి పెద్దిరాజు, పెదవేగి జెడ్‌పిటిసి విజయబాబు, పాలకొల్లు జెడ్‌పిటిసి గోవిందరాజు, మరో ఇద్దరు సభ్యులు మాట్లాడారు. వైసిపి గుర్తుపై గెలిచి పార్టీకి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ ద్రోహం చేశారన్నారు. వైసిపి సభ్యులంతా ఛైర్‌పర్సన్‌గా ఎన్నుకుంటే టిడిపిలో చేరారన్నారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్‌పై అనర్హత వేటువేయాలని కోరారు. వీరవాసరం జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్‌నాయుడు జెడ్‌పి ఛైర్‌పర్సన్‌కు అనుకూలంగా మాట్లాడారు. ఎంఎల్‌సి వంకా రవీంద్ర మాట్లాడుతూ ఒక పార్టీ నుంచి పదవి పొంది, వేరొక పార్టీలో చేరడం నైతికత కాదన్నారు. ఎక్కడున్నా పనులు చేయించుకోవచ్చునన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రతిపక్ష పార్టీలను గౌరవించే వ్యక్తులన్నారు. ఎవరు బలవంత పెట్టారో చెప్పాలన్నారు. ఇక సభ్యులు ఎవరూ మాట్లాడకపోవడంతో జెడ్‌పి సిఇఒ విజయరాజు మాట్లాడుతూ పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ఎంఎల్‌ఎ, ఎంపీలకు మాత్రమే వర్తిస్తుందని, స్థానిక సంస్థలకు వర్తించదని చెప్పారు. ఒక సభ్యుడు పదవి చేపట్టాక నాలుగేళ్ల వరకూ అవిశ్వాసం పెట్టడం సైతం కుదరదని స్పష్టం చేశారు. ఓటింగ్ పెట్టి తీర్మానం చేయాలని వైసిపి సభ్యులు అడగ్గా, అందుకు చట్టం అంగీకరించదని అన్నారు. మినిట్స్ నోట్ చేసి ఇవ్వాలని, ఆ వివరాలను పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులకు పంపించాలని సభ్యులు కోరగా, ఆ విధంగా చేస్తామని చట్టప్రకారం ముందుకు సాగుతామని సిఇఒ తెలిపారు. దీంతో వైసిపి సభ్యులు ఎటువంటి ప్రతిఘటనా లేకుండానే మౌనంగా ఉండిపోయారు దీంతో గంటలోపే సమావేశం ముగిసింది. ఆఖరులో లీగల్‌గా ముందుకు సాగుతామని వైసిపి సభ్యులు తెలిపారు.

డెడ్‌బాడీ డోర్ డెలివరీపై

వీడని మిస్టరీ..!

రంగరాజు చిన్న అల్లుడు చుట్టూ అనుమానాలు

ఆటోవాలాకు పార్శిల్ ఇచ్చిన మహిళ కోసం గాలింపు

హత్యాఘటన సైతం సాగిపాడు, పిప్పర ప్రాంతాల్లో జరిగి ఉండొచ్చని అనుమానాలు

ప్రజాశక్తి - ఉండి

డెడ్‌బాడీ డోర్ డెలివరీ కేసులో మిస్టరీ కొనసాగుతోంది. మృతుడు ఎవరు అనే దగ్గర నుంచి పార్శిల్ వచ్చిన కొద్దిసేపటి వరకూ అదృశ్యమైన ముదునూరి రంగరాజు చిన్న అల్లుడు చేకూరి శ్రీధర్‌వర్మ ఆచూకీ, పార్శిల్ ఆటో డ్రైవర్‌కు అప్పగించిన మహిళ ఎవరనేది తేలితే ఈ కేసు చిక్కుముడి వీడే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. ఆ దిశగా కేసు దర్యాప్తు సాగిస్తున్న పోలీసులు ఇప్పటికే ముదునూరి రంగరాజును, ఆయన భార్య హైమావతిని, పెద్ద కుమార్తె సాగి తులసి, చిన్న కుమార్తె చేకూరి రేవతిని ఉండి పోలీస్ స్టేషన్లో విచారించారు. అనంతరం వీరిని కాళ్ల పోలీసు స్టేషన్‌కు తరలించి మరింత లోతుగా విచారిస్తున్నట్లు తెలిసిందే. ఇదే సమయంలో గణపవరం మండలం పిప్పరకు చెందిన ఆటోడ్రైవర్‌ను ఆకివీడు పోలీసు స్టేషన్లో విచారిస్తున్నట్లు సమాచారం.

ప్రధానంగా మృతుడు ఎవరనే దానిపై పోలీసులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. సాగిపాడు రోడ్డు వద్ద ఆటో డ్రైవర్‌కు పార్శిల్ అప్పగించడంతో ఆ పరిసర ప్రాంతాల్లోనే ఈ హత్య జరిగినట్లు అనుమానిస్తున్నారు. మృతుడు తాడేపల్లిగూడెం, గణపవరం, ఉండి ప్రాంతాలకు చెందిన వాడా, లేక వలస కూలీనా, మరెవరైనానా అనే దిశగా దర్యాప్తు సాగిస్తున్నట్లు తెలిసింది. లేక చిన్న అల్లుడు చేకూరి శ్రీధర్‌వర్మకు తెలిసిన వ్యక్తి అయినా కావొచ్చని భావిస్తున్నారు. దీంతో మృతుని ఆచూకీ తెలుసుకునే ప్రయత్నాల్లో భాగంగానే శ్రీధర్‌వర్మ కోసం గాలింపు ముమ్మరం చేశారు. శ్రీధర్‌వర్మను శనివారం ఉదయం హైదరాబాద్‌లో గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారం సాగినా పోలీసులు ధ్రువీకరించలేదు. ఏదేమైనా డెడ్‌బాడీకి శ్రీధర్‌వర్మకు కచ్చితంగా సంబంధం ఉందనే కోణంలో పోలీసులు ముందుకెళ్తున్నట్లు సమాచారం. ఈ దశలోనే శ్రీధర్‌వర్మకు గతంలో వివాహమైనట్లు వెలుగుచూసింది. మొదటి భార్య కాళ్ల మండలం ఇస్కులంక వాసిగా సమాచారం. రంగరాజు చినకుమార్తె రేవతి భీమవరం కళాశాలలో చదువుతున్న సమయంలో శ్రీధర్‌వర్మ పరిచయమై ప్రేమ వివాహం చేసుకున్నారని, తరచూ ఎక్కడోచోట ఉంచేవాడని, స్థిర నివాసం లేదని చెబుతున్నారు. ఇక ఆటో డ్రైవర్‌కు పార్శిల్ అప్పగించిన మహిళకు ఆటో డ్రైవర్ ఫోన్ నంబర్ ఎలా వచ్చింది, ఆటో డ్రైవర్‌కు, మహిళకు సంబంధం ఏమైనా ఉందా అని ఆరా తీసినట్లు తెలిసింది. అదే సమయంలో మహిళ నుంచి ఆటో డ్రైవర్‌కు వచ్చిన కాల్ ఆధారంగా ఆ నెంబర్‌కు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వస్తున్నట్లు సమాచారం. ముదునూరి రంగరాజుకు ఎకరంన్నర పొలం ఉండగా కుమార్తెలిద్దరికీ చెరో అర ఎకరం ఇచ్చినట్లు తెలిసింది. ఇల్లు రంగరాజు భార్య హైమావతి పేరున ఉంది. ఇదిలా ఉండగా డెడ్‌బాడీ మెడకు నైలాన్ తాడు ఉండడంతో దాంతోనే హత్య చేసి ఉండొచ్చని భావిస్తున్నారు. ఇక ఆ మృతదేహానికి భీమవరం ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసిన అనంతరం పోలీసులు భీమవరం మున్సిపల్ సిబ్బంది సహకారంతో ఖననం చేయించినట్లు సమాచారం.

ఏదేమైనా పార్శిల్ ఇచ్చిన మహిళ, రంగరాజు చిన్నఅల్లుడు చేకూరి శ్రీధర్‌వర్మ దొరికి నోరు విప్పితేనే ఈ కేసు మిస్టరీ వీడే అవకాశం ఉందని అంతా భావిస్తున్నారు.

జెడ్‌పి సమావేశానికి

కోరం కష్టాలు..!

సమావేశానికి 30 మంది వైసిపి సభ్యులు గైర్హాజరు

కోరం లేక గంటపాటు నిలిచిన సమావేశం

అతికష్టంపై 17 మంది సభ్యుల సంతకాలతో సమావేశం నిర్వహణ

సమావేశానికి మంత్రులు, ఎంపీలు, ఎంఎల్‌ఎలు డుమ్మా

జిల్లాలోని విద్యారంగ సమస్యలను పరిష్కరించండి

ఉపాధ్యాయ ఎంఎల్‌సి గోపీమూర్తి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గతంలో ఎన్నడూ లేనివిధంగా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి కోరం కష్టాలు ఏర్పడ్డాయి. సమావేశం నిర్వహించాలంటే మొత్తం సభ్యుల్లో మూడో వంతు హాజరు కావాలి. ఆ తర్వాతే సమావేశం ముందుకు సాగించాలి. లేకపోతే సమావేశంలో తీసుకున్న నిర్ణయాలేవీ తీర్మానాలకు నోచుకోని పరిస్థితి. వైసిపి జెడ్‌పిటిసి సభ్యులు జెడ్‌పి ఛైర్‌పర్సన్‌పై గుర్రుగా ఉండటంతో ఉదయం ప్రత్యేక సమావేశానికి హాజరైనప్పటికీ మధ్యాహ్నం నుంచి జరిగిన సర్వసభ్య సమావేశాన్ని మాత్రం బాయ్‌కాట్ చేశారు. జిల్లా పరిషత్‌లో ప్రస్తుతం 47 మంది సభ్యులు ఉండగా 15 మంది ఉంటేనే సమావేశం నిర్వహణ సాధ్యం. రెండు గంటలకు సమావేశం ప్రారంభం కావాల్సి ఉండగా కోరం లేక మూడు గంటల వరకూ సమావేశం ప్రారంభం కాని పరిస్థితి. ఒకానొక దశలో సమావేశం రద్దవుతుందని అంతా భావించారు. ఎట్టకేలకు 17 మంది సభ్యులు సంతకాలు చేయడంతో గంట ఆలస్యంగా సమావేశం ప్రారంభమైంది. 30 మంది వైసిపి సభ్యులు సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ ముందుగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా అన్ని హామీలనూ అమలు చేస్తుందన్నారు. జెడ్‌పి సభ్యులకు గ్రూప్ ఇన్సూరెన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జెడ్‌పిటిసి, ఎంపిటిసిలకు గౌరవం వేతనం చాలాకాలంగా పెండింగులో ఉందని, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లాలని తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌ను కోరారు. పదోతరగతి పిల్లలకు గతేడాది మాదిరిగానే విజయకేతనం బుక్ అందిస్తామన్నారు. వ్యవసాయం, డ్వామా, విద్య, వైద్యం వంటి శాఖలపై సంబంధిత అధికారులు మాట్లాడారు. సభ్యులు లేకపోవడంతో ప్రజా సమస్యలపై పెద్దగా చర్చ లేకుండాపోయింది.



మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఉమ్మడి పశ్చిమగోదావరిలో 15 మంది ఎంఎల్‌ఎలు ఉండగా నలుగురు మాత్రమే హాజరయ్యారు. 11 మంది డుమ్మాకొట్టారు. మంత్రులు, ఎంపీలు ఎవరూ రాలేదు. పత్సమట్ల ధర్మరాజు, బడేటి చంటి, బొలిశెట్టి శ్రీనివాస్, సొంగా రోషన్‌కుమార్, ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి మాత్రమే హాజరయ్యారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ సమావేశంలో సభ్యులు తెలియజేసిన సమస్యలపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని, చర్యలను సంబంధిత ప్రజాప్రతినిధులకు తెలపాలని ఆదేశించారు. ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించి రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. జెడ్‌పిటిసి ఒకరు మాట్లాడుతూ క్యాన్సర్ రోగులకు పింఛన్ అందించేవిధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

విద్యాశాఖలో సమస్యలను పరిష్కరించాలి..

బి.గోపీమూర్తి, ఉపాధ్యాయ ఎంఎల్‌సి



నూతనంగా ఎన్నికైన ఉపాధ్యాయ ఎంఎల్‌సి గోపీమూర్తి తొలిసారి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. ఆయన్ని అందరూ అభినందించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ తనను ఉపాధ్యాయులంతా రూపాయి ఖర్చు చేయకుండా అత్యధిక మెజార్టీతో గెలిపించారన్నారు. గత ప్రభుత్వం 117 జిఒ తీసుకురావడంతో ఉపాధ్యాయుల సంఖ్య తగ్గిపోయిందన్నారు. దీంతో అదనపు భారం, ఆన్‌లైన్ భారంసైతం పడిందన్నారు. ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని కోరారు. కొవ్వూరులోని గవర్నమెంట్ కాలేజీలో సరైన సౌకర్యాలు లేవని, జెడ్‌పి గ్రాంట్ ఇవ్వాలని కోరారు. రైతులు కోతలు కోస్తూ వర్షాలకు ఇబ్బందులు పడుతున్నారని, జిల్లా పరిషత్ నుంచి టార్పాలిన్లు అందిస్తే బాగుంటుందన్నారు. పదో తరగతి విద్యార్థులకు మెటీరియల్ ఇస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ భారాలు తగ్గించేందుకు కంప్యూటర్ ఆపరేటర్లను నియమిస్తే బాగుంటుందన్నారు. మంత్రి లోకేష్‌ను ఇటీవల కలిసి ఆయా ప్రాంతాలకు అనువుగా పౌష్టికాహారం అందించాలని కోరినట్లు తెలిపారు. ఇక్కడ పులిహోర ఇస్తున్నారని, అది మార్పు చేయాలని సూచించారు.


పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

అధ్యక్షులుగా మురళీకృష్ణంరాజు, ఉపాధ్యక్షులుగా మార్రాజు ఎన్నిక

ధ్రువీకరణ పత్రాలు అందించిన జెసి రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

గోదావరి పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షులుగా పాలకోడేరుకు చెందిన కూనదిరాజు మురళీకృష్ణంరాజు, ఉపాధ్యక్షులుగా నరసాపురానికి చెందిన గుబ్బల మార్రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మురళీ కృష్ణంరాజు అనాకోడేరు నీటి పంపిణీ సంఘ అధ్యక్షులుగా ఉండగా, నరసాపురం నీటి పంపిణీ సంఘానికి మార్రాజు అధ్యక్షులుగా ఉన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎన్నికకు ఎన్నికల అధికారి టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. 20 నీటి పంపిణీ సంఘాల అధ్యక్ష ఉపాధ్యక్షులు ఈ ఎన్నికలో పాల్గొన్నారు. అధ్యక్షులుగా మురళీకృష్ణంరాజు, ఉపాధ్యక్షులుగా మార్రాజు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రాహుల్ కుమార్‌రెడ్డి ప్రకటించారు. వారికి ఎన్నిక ధ్రువపత్రాలను అందజేశారు. పాలకోడేరుకు చెందిన మురళీకృష్ణంరాజు టిడిపిలో క్రియాశీలకంగా ఉన్నారు. టిడిపి హయాంలో పదేళ్లపాటు నీటి సంఘం అధ్యక్షులుగా పనిచేశారు. మురళీకృష్ణంరాజు భార్య కృష్ణకుమారి పాలకోడేరు వైస్ ఎంపిపిగా పని చేశారు. వైస్ ఛైర్మన్ మార్రాజు ఎల్‌బిచర్ల ఉప సర్పంచిగా గతంలో పని చేశారు. గత మూడేళ్ల నుంచి ఆయన జనసేనలో ఉన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, 20 నీటి పంపిణీ సంఘాల అధ్యక్ష ఉపాధ్యక్షులు, భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు, మాజీ ఎపీ తోట సీతామహాలక్ష్మి, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, మాజీ ఎఎంసి ఛైర్మన్‌కోళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



జెసి నుంచి నియమకపత్రాలు అందుకుంటున్న ప్రాజెక్టు కమిటీ అధ్యక్షులు మురళీకృష్ణమరాజు, ఉపాధ్యక్షులు మార్రాజు

జూనియర్ అసిస్టెంట్ ఘరానా మోసం

చెక్కులు ఫోర్జరీ చేసి రూ.62 లక్షలు ప్రభుత్వ నిధులు దుర్వినియోగం

పాలకొల్లు ప్రభుత్వాసుపత్రి ఉద్యోగి కుంచె మురళీవెంకట తులసీధర్ అరెస్టు

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ నిధులు దుర్వినియోగానికి పాల్పడితే క్రిమినల్ చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. పాలకొల్లు ఏరియా ఆసుపత్రి జూనియర్ అసిస్టెంట్ కుంచె మురళీ వెంకట తులసీధర్ (26)ను ప్రభుత్వ నిధుల దుర్వినియోగం, చెక్కుల ఫోర్జరీ కేసులో అరెస్టుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. శనివారం తులసీధర్‌ను పాలకొల్లు సిఐ కె.రజనీకుమార్ ఆధ్వర్యంలో ఎల్‌ఆర్‌పేట ఇంటి వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పాలకొల్లు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఒ.రవికుమార్ ఫిర్యాదు మేరకు చేపట్టిన దర్యాప్తులో తులసీధర్ సుమారు రూ.62 లక్షలు నిధులను దుర్వినియోగం చేసినట్లు తేలిందని పేర్కొన్నారు. ఆసుపత్రికి చెందిన ఆరోగ్యశ్రీ పేషెంట్‌కేర్ అక్కౌంట్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డెవలప్‌మెంట్ సొసైటీ అకౌంట్, పిఎఫ్ఎంఎస్ ఖాతాలను 2021 జులై నుంచి ఈయనే నిర్వహిస్తున్నాడు. ఈ ఖాతాలకు సంబంధించిన బ్యాంకు స్టేట్‌మెంట్స్, క్యాష్‌బుక్స్, చెక్కు రిజిస్టర్ వివరాలు ఇవ్వాలని సూపరింటెండెంట్ కోరడంతో నిధుల దుర్వినియోగం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. ఆరోగ్య శ్రీ ఖాతా నుంచి గత ఏప్రిల్ ఒకటి నుంచి అక్టోబర్ 14 వరకూ సుమారు రూ.12 లక్షలు చెక్కులపై సంతకాలు ఫోర్జరీ చేసి సొమ్ము డ్రా చేసినట్లు గుర్తించారన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డెవలప్‌మెంట్ సొసైటీ ఖాతా నుంచి సుమారు రూ.36 వేలు, పిఎఫ్ఎంఎస్ ఖాతా నుంచి రూ.3.37 లక్షలు వరకూ స్వాహా చేసినట్లు తేలిందన్నారు. దీంతో మరింత లోతైన విచారణ చేయగా 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల్లోనూ సుమారు రూ.46 లక్షలు అప్పటి సూపరింటెండెంట్ సంతకాలు ఫోర్జరీ చేసి చెక్‌ల ద్వారా డబ్బు డ్రా చేసి తన సొంతానికి వాడుకున్నట్లు విచారణలో తేలిందని తెలిపారు. మొత్తంగా రూ.62 లక్షలు స్వాహా చేసినట్లు గుర్తించి అరెస్టుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు.

కలవరం.. కలకలం..!

అధికార పక్షంలో ఉన్న పూర్వపు వైసిపి నేతల తీరుతో టిడిపిలోనూ.. మరోసారి పోలవరం పర్యటన సందర్భంగా సిఎం చంద్రబాబు తీరుతో పోలవరం నిర్వాసితుల్లోనూ కలవరం నెలకొనగా.. రేవ్ పార్టీ, డెడ్‌బాడీ డోర్ డెలివరీ ఘటనలతో జిల్లాలో కలకలం నెలకొంది.

అధికార టిడిపికి వైసిపి నుంచి వచ్చిన నేతలతో కొత్త తలనొప్పులు పెరిగాయనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. నూజివీడులో గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మంత్రి కొలుసు పార్థసారథి వైసిపి మాజీ మంత్రి జోగి రమేష్‌తో కలిసి పాల్గొనడంపై పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. దీనిపై ఇటు టిడిపి శ్రేణులతోపాటు అధినాయకులు చంద్రబాబు, లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేయడం గమనార్హం. ముందస్తు సమాచారం లేక ఇలా జరిగిందని మంత్రి పార్థసారథి వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఇదే సమయంలో ఏలూరుకు చెందిన మాజీ మంత్రి ఆళ్ల నాని టిడిపిలో చేరేందుకు సిద్ధం కావడం, దీనిపై టిడిపి శ్రేణులు మండిపడడం అందరికీ తెలిసిందే. అయితే పోలవరం పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంఎల్‌ఎ బడేటి బుజ్జికి నానిని పార్టీలోకి తీసుకుంటున్నట్లు స్పష్టం చేయడంతో అంతా అవాక్కయ్యారు. దీనిపై టిడిపి శ్రేణులకు సర్దిచెప్పాల్సిన బాధ్యత ఎంఎల్‌ఎ చంటిపైనే పెట్టడంతో అనివార్యంగా ఆయనే మీడియా సమావేశం నిర్వహించి నాని చేరికను ప్రకటించాల్సి వచ్చింది. ఏదేమైనా ఈ రెండు ఘటనలు టిడిపిలో కలవరం సృష్టించాయనే చెప్పొచ్చు.

ఇక చంద్రబాబు మరోసారి గత సోమవారం పోలవరం పర్యటనకు విచ్చేశారు. పనులను పరిశీలించి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 2026 అక్టోబర్ నాటికి పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని ఘంటాపథంగా చెప్పారు. దాని చుట్టూనే ఆయన మాటలు, సమీక్ష అంతా సాగాయి. ప్రాజెక్టు పనులు సరే.. ప్రాజెక్టు వల్ల నీట మునుగుతున్న నిర్వాసితులకు పరిహారం, పునరావాసంపై పెద్దగా చర్చించకపోవడం, స్పష్టత ఇవ్వకపోవడంపై సర్వత్రా చర్చనీయాంశమైంది. గతంలోనూ, గత ఎన్నికల ముందు కూటమి నేతలు నిర్వాసితులకు మేలైన పరిహారం ఇచ్చి పునరావాసం కల్పిస్తామని ఇచ్చిన హామీలేవీ చంద్రబాబు పర్యటనలో చర్చకు రాకపోవడంపై నిర్వాసితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ పక్క ప్రాజెక్టు పేరిట తమను నిలువునా ముంచుతూ కనీసం చట్టబద్ధంగా ఇవ్వాల్సిన పరిహారం, పునరావాసంపై నోరు మెదపకపోవడాన్ని తప్పుబడుతున్నారు. ఇప్పటికైనా ప్రాజెక్టు పనులతోపాటు పునరావాసం, పరిహారంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని నిర్వాసితులు కోరుతున్నారు.



ఇక ప్రశాంతతకు మారుపేరైన పశ్చిమగోదావరి జిల్లాలోనూ పాశ్చాత్య సంస్కృతి పోకడలు, నేర ప్రవృత్తి జడలు విప్పుతుందనడానికి ఇటీవల చోటుచేసుకున్న వరుస సంఘటనలు చెప్పకనే చెబుతున్నాయి. నిడమర్రు మండలం క్రొవ్విడిలో జనసేన నేత పుట్టినరోజు వేడుకల సందర్భంగా అశ్లీల (నగ్న) నృత్యాల ప్రదర్శన ఏర్పాటు చేయడం కలకలం సృష్టించింది. ఆ వీడియోలు నాలుగు రోజుల తర్వాత వైరల్ కావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. జనసేన అధినాయకత్వం వెంటనే స్పందించి ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. తర్వాత పోలీసులు సుమారు 22 మందిని అరెస్టు చేశారు. ఇంతవరకూ బాగానే ఉంది. గ్రామంలో జరిగిన జుగుప్సాకరమైన ఘటన వీడియో వైరల్ అయ్యే వరకూ పోలీసు అధికారుల దృష్టికి రాకపోవడం ఇంటెలిజెన్స్ వ్యవస్థ పని తీరులో వైఫల్యానికి నిదర్శనంగా ఉందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో డ్రగ్స్ ఆనవాళ్లు లభ్యమయ్యాయి. ఇక గంజాయికి అయితే అంతే లేదు. పరిస్థితి రోజురోజుకీ దిగజారుతున్న తరుణంలో ఈ ఘటన పోలీసు వ్యవస్థకు మచ్చ తెచ్చేలా ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

ఇక ఉండి మండలం యండగండిలో డెడ్‌బాడీ డోర్ డెలివరీ తీవ్ర కలకలం సృష్టించింది. ఎలక్ట్రికల్ సామాన్లు పేరిట పంపిన పార్శిల్‌లో పురుషుని మృతదేహం ఉండటం ఆ పార్శిల్ అందుకున్న కుటుంబంతోపాటు ఆ గ్రామస్తులను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారెవరూ అనే దానితోపాటు ఆ మృతదేహం ఎవరిదా అని అంతా తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. మృతుడు ఎవరూ, ఎందుకు హత్య చేశారు, పార్శిల్ రూపంలో ఎందుకు పంపారు వంటి పలు ప్రశ్నలకు సమాధానాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఏదేమైనా ఒక నిండు ప్రాణాన్ని బలిగొనడంతోపాటు ఆ మృతదేహాన్ని డోర్ డెలివరీ చేయడంపై మానవత్వ విలువలు ఏ స్థాయిలో దిగజారిపోయాయనే దానికి నిదర్శనమని పలువురు నిర్వేదం వ్యక్తం చేస్తున్నారు. ఒకే దేశం, ఒకే భాష, ఒకే ఎన్నిక అని, స్వదేశీ అంటూ గొప్పలు చెప్పుకుంటున్న పాలకులు మరి పాశ్చాత్య సంస్కృతి అడ్డుకట్టకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అర్థం కాని ప్రశ్నగా ఉందని పలువురు పెదవి విరుస్తున్నారు. ఏదేమైనా ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- వివిఎస్ఎస్‌వి.ప్రసాద్

పిడిఎస్ బియ్యం మళ్లిస్తే ఉపేక్షించం

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పిడిఎస్ బియ్యంను దారిమళ్లించినా, అవకతవకలకు పాల్పడినా ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. శనివారం నరసింహపురం వద్ద శ్రీ రాధాకృష్ణ రైస్‌మిల్, లక్ష్మీకృష్ణ రైస్ ట్రేడర్స్, పీపీ రోడ్డులో రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద ఉన్న లక్ష్మీ నరసింహ ట్రేడర్స్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిఎంఆర్ ఎంత, డెలివరీ ఇచ్చింది ఎంత అని ప్రశ్నించి లెక్కలను పరిశీలించారు. మిల్లుకు అనుబంధంగా ఉన్న గొడౌన్లలో ధాన్యం నిల్వలను పరిశీలించారు. నిబద్ధతగా వ్యాపార లావాదేవీలు నిర్వహించాలని సూచించారు. కలెక్టర్ వెంట డిఎస్ఒ ఎన్.సరోజ, ఎఎస్ఒ ఎం.రవిశంకర్, రైస్‌మిల్లుల యాజమాన్యం కొత్త శ్రీనివాస్, చవ్వా భానుకృష్ణమూర్తి, సత్యకృష్ణ తదితరులు ఉన్నారు.

టిడ్కో ఇళ్లలో మౌలిక వసతులు కల్పించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వాసుదేవరావు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు వాటిని వెంటనే అందజేయాలని, ఆ ఇళ్లలో మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానికంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడారు. తక్షణం సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలకు పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎం.వైకుంఠరావు, సిహెచ్.వెంకటేశ్వరరావు, ఎం.ఆంజనేయులు, డి.నాగేశ్వరరావు, డి.త్రిమూర్తులు, కె.కృష్ణ, సిహెచ్.వరలక్ష్మి, కోదండం, సాంబ నాగరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు : కలెక్టర్

భీమవరం :పార్కులు అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. శనివారం పట్టణంలోని హౌసింగ్ బోర్డులో ఉన్న చిల్డ్రన్ అండ్ వాకింగ్ పార్కును, ఆదిత్య కళావేదిక పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి హౌసింగ్ బోర్డ్ చిల్డ్రన్ పార్కులో స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్కులో స్వయంగా చీపురు పట్టి పారిశుధ్య కార్మికులతో కలిసి చెత్తను ఊడ్చారు. కొడవలి పట్టుకుని గడ్డిని తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హౌసింగ్ బోర్డులో ఉన్న పార్కులను అభివృద్ధి చేయడానికి స్వచ్ఛంగా ప్రజలు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వరరావు, కంతేటి వెంకట్‌రాజు, హౌసింగ్ బోర్డ్ అసోసియేషన్ అధ్యక్షులు సరి పిడకల రామారావు పాల్గొన్నారు.

11, 29వ వార్డుల్లో కమిషనర్ తనిఖీ

నరసాపురం:పట్టణంలో 11, 29వ వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య పారిశుధ్య పనులను శనివారం తనిఖీ చేశారు. వార్డుల్లో శానిటేషన్ సక్రమంగా నిర్వహించాలని, సిబ్బందిని ఆదేశించారు. బస్టాండ్ ఏరియా, శివాలయం వద్ద శానిటేషన్‌ను పర్యవేక్షించారు. ప్రతిరోజూ ప్రత్యేక శానిటేషన్ నిర్వహించాలని, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పురపాలక సంఘం పరిధిలో అన్నా కాంటీన్‌ను తనిఖీ చేశారు. అన్నా కాంటీన్‌లోని ఆహార పదార్థాలను స్వయంగా తనిఖీ చేశారు. ఆహార పదార్థాలు సరిగ్గా ఉన్నదీ లేనిదీ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అన్నా క్యాంటీన్ వద్ద ఏర్పాటు చేయబడిన అల్పాహారం తీసుకొనే ప్రజలు చాలా సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేంద్ర ప్రసాద్‌పాత్రుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాలువ గట్టుపై గృహాలు తొలగించాలనడం దారుణం

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరు శివారు ఎఎస్ఆర్ నగర్‌లోని రాజ్ కాలువగట్టు వెంబడి ఉన్న గృహాలను తొలగించమనడం దారుణమని సిపిఎం మండల కార్యదర్శి శేషాపు అశ్రియ్య ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్ కాలువ గట్టు వెంబడి ఉన్న గృహాలను శనివారం సిపిఎం నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు సమస్యను సిపిఎం నేతలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 45 ఏళ్ల నుంచి గృహాలు నిర్మించుకుని ఇక్కడే జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అంతా వ్యవసాయ కూలీలేనని తెలిపారు. ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు గృహాలు తొలగించాలని అధికారులకు ఆదేశాలిచ్చారని బాధితులు చెబుతున్నారని ఇది సరైంది కాదని తెలిపారు. ఆయన వెంట సిపిఎం నాయకురాలు మరియమ్మ, స్థానికులు ఉన్నారు.

హెచ్ఐవి రోగులకు మందుల పంపిణీ

ఉండి: హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలందిస్తూ నాణ్యమైన మందులు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని జిల్లా లెప్రసీ, టిబి అధికారి డాక్టర్ భాను నాయక్ అన్నారు. శనివారం ఉండి పిహెచ్‌సిలో హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు మందులు అందించే కార్యక్రమం ఎఆర్‌టిను డాక్టర్ భాను నాయక్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హెచ్ఐవి సోకిన వ్యాధిగ్రస్తులు కుంగిపోనవసరం లేదని తగు మందులు వాడకం ద్వారా రోగనిరోధక శక్తిని పెంచుకోవడం వల్ల భవిష్యత్తులో వచ్చే ఇబ్బంది నుంచి అధిగమించవచ్చని తెలిపారు. హెచ్ఐవి వ్యాధిగ్రస్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని, భయపడాల్సిన పనిలేదని సూచించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. పిహెచ్‌సి డాక్టర్ బి.సాయి చంద్ర మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాధిగ్రస్తుల కోసం ఎఆర్‌టి మందులు కొరత లేకుండా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విస్తరణాధికారి ఆర్.కృష్ణకుమార్, సిబ్బంది, హెచ్ఐవి వ్యాధిగ్రస్తులు పాల్గొన్నారు.

వాసవీ జిఎంఆర్‌లో జాబ్‌మేళా

38 మంది అభ్యర్థులు ఎంపిక

తాడేపల్లిగూడెం:ఎపి నైపుణ్య అభివృద్ధి సంస్థ, వాసవీ జిఎంఆర్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాలో 38 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ వి.శ్రీనివాసు, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వివిఎన్.లక్ష్మీ నారాయణ్ తెలిపారు. ఈ జాబ్ మేళాలో మొత్తం 98 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అపోలో ఫార్మసీ, ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీ, భారత్ ఫైనాన్సియల్ లిమిటెడ్ ప్రతినిధులు 38 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన వారిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్, ఏపి నైపుణ్య అభివృద్ధి కోఆర్డినేటర్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గుర్తు తెలిని వృద్ధురాలు మృతి

నేరాలు - ఘోరాలు

తణుకు రూరల్: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందిన ఘటన శనివారం తణుకు రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. సుమారు 70 సంవత్సరాల వయస్సు కలిగిన వృద్ధురాలు రైలు పట్టాల సమీపంలో చనిపోయి ఉండడంతో గుర్తించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకొని తణుకు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉంచారు. ఆమె ఆచూకీ కోసం తెలిసిన వారు 70939 39777, 9014099132 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. భీమవరం జిఆర్‌పి ఎస్ఐ పివిఐ.రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

ఉండి:అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై ఉండి పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామానికి చెందిన ఇళ్ల ధనలక్ష్మికి పెరవలికి చెందిన సత్యనారాయణతో 2011లో వివాహమైంది. ఆ సమయంలో 5 లక్షల రూపాయల కట్నం ఇచ్చారు. కొంతకాలంగా వ్యసనాలకు బానిసైన సత్యనారాయణ అదనంగా రూ.2 లక్షల కట్నం తీసుకురావాలని భార్య ధనలక్ష్మిపై వేధింపులకు పాల్పడుతున్నాడు. ధనలక్ష్మి అత్త మామ ఇద్దరు ఆడపడుచులు సత్యనారాయణకు మద్దతు పలికి ధనలక్ష్మిని మానసికంగా వేధించి సత్యనారాయణకు రెండో వివాహం చేస్తామని బెదిరించడంతో ఇటీవల ఎన్ఆర్‌పి అగ్రహారంలోని తండ్రి వద్దకు వచ్చేసింది. శనివారం ధనలక్ష్మి భర్తపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ దువ్వా శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి

తణుకు రూరల్:గంజాయికి బానిసలైతే కుటుంబానికి, సమాజానికి ప్రమాదకరమని, యువత వాటికి దూరంగా ఉండాలని తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సిఐ ఎస్.మణికంఠ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక బస్టాండ్ కూడలిలో గంజాయి తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి వినియోగానికి నేర ప్రవృత్తి పెరుగుతుందన్నారు. అనంతరం యువకులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ ఎన్.అప్పలస్వామి, శ్రీమన్నారాయణ, కానిస్టేబుల్ జి.గంగాధర్ పాల్గొన్నారు.

మోటార్ సైకిళ్ల చోరీ: ఇద్దరు అరెస్టు

వీరవాసరం:హైదరాబాద్‌లో స్విగ్గీ, రాపిడో బాయ్‌లుగా పని చేస్తూ వీరవాసరం పరిసర ప్రాంతాల్లో మోటార్ సైకిళ్ల దొంగతనాలకు, చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డ ఇద్దరు నేరగాళ్లను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి తెలిపారు. వివరాలను ఎస్‌పి శనివారం వీరవాసరం పోలీస్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో తెలిపారు. పోడూరు మండలం కవిటం గ్రామానికి చెందిన కాలా రమేష్, కడలి బాబీ హైదరాబాద్‌లో డెలివరీ బాయ్‌లుగా పని చేస్తూ గత ఏప్రిల్‌లో తన స్వగ్రామం వచ్చి వ్యసనాలకు బానిసయ్యారు. ఈ క్రమంలో వారిద్దరూ వీరవాసరం మండలం మడుగుపోలవరం లంక గ్రామానికి చెందిన మహిళ మల్లుల పెద్దిలక్ష్మి మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిపోవడం, మోటార్ సైకిళ్లు దొంగిలించడం వంటి నేరాలకు పాల్పడ్డారని తెలిపారు. వీరిపై వీరవాసరం, భీమవరం, పాలకొల్లు, యలమంచిలి, పోడూరు, పాలకోడేరు పోలీస్ స్టేషన్లలో 30 కేసులు నమోదు చేశామన్నారు. ఈ నెల 21న డిఎస్‌పి ఆర్.జయసూర్య పర్యవేక్షణలో భీమవరం రూరల్ సిఐ బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వీరవాసరం ఎస్ఐ ఎం.రాజకుమార్‌కు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి వీరవాసరం మండలం బుధరాయుడుచెరువు ప్రాంతంలో ముద్దాయిలు మోటార్ సైకిల్‌పై వస్తుండగా వారిని పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుండి 39.6 గ్రాముల బంగారం, 27 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ముద్దాయిలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన వీరవాసరం పోలీస్ స్టేషన్ అధికారులను సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మిల్లుల్లో ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

రైతు సేవా కేంద్రాల ద్వారా రైసు మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. మిల్లుల వద్ద ఎటువంటి ఆటంకాలు కలగకుండా చూడాలని కస్టోడియన్ అధికారులు విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. విఆర్ఒలు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ జిల్లాలోని రెవెన్యూ డివిజన్ అధికారులు, తహశీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులు, కోపరేటివ్ అధికారులు, సిఎస్ డిటిలు, ఆర్ఎస్‌కె సిబ్బందితో ధాన్యం సేకరణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ అయ్యేలా మిల్లర్లు సహకరించాలని సూచించారు. జిల్లాలో 264 రైతు సేవా కేంద్రాలకు గాను 257 సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకూ 3.63 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి డబ్బులు 48 గంటల్లోగా రైతుల ఖాతాల్లో జమయ్యేలా చూడాలన్నారు. సన్న, చిన్నకారు రైతులతో పాటు అందరూ రైతులకు గ్రామ సభల ద్వారా అవగాహన కల్పించి ప్రధానమంత్రి పసల భీమా యోజన పథకం బ్యాంకు రుణాలు మంజూరయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఎఎం టెక్నికల్ ఇబ్రహం, డిటి శేఖర్ బాబు, డిఎం కంట్రోల్ రూమ్ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

ఘనంగా జగన్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అందించిన సేవలు నిరుపేదలు మరువరని జుత్తిగ గ్రామ సర్పంచి తమనంపూడి వీర్రెడ్డి అన్నారు. శనివారం జుత్తిగలోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద జగన్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ప్రముఖులు గుడిమెట్ల సాయి మురళీరెడ్డి, వైసిపి అధ్యక్షులు కొవ్వూరి చిన్నారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నాయకులు, కార్యకర్తలు, రెడ్డి యూత్ సభ్యులు కేక్ కట్ చేశారు.

కాళ్ల : జగన్మోహన్ రెడ్డికి ప్రజలు అండగా ఉన్నారని వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్ నరసింహరాజు అన్నారు. పెదఅమిరంలో వైసిపి కార్యాలయంలో జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు గణేశ్న రాంబాబు, పివి.ఆర్కే, ఆంజనేయరాజు, నంద్యాల లక్ష్మి సీతారామయ్య పాల్గొన్నారు.

గణపవరం : మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు గణపవరంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆచంట : పరిపాలనా విధానంలో నూతన మార్పులకు శ్రీకారం చుట్టింది జగన్మోహన్‌రెడ్డి అని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్ అన్నారు. జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని వైఎస్ఆర్ విగ్రహం వద్ద కార్యకర్తల సమక్షంలో కేక్‌కట్ చేసి జగన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్, వైసిపి మండల అధ్యక్షులు, వేమవరం సర్పంచి జక్కంశెట్టి చంటి ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. అనంతరం పేదలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మనవర్తి విజయ్ కుమార్, దేవిరెడ్డి రాంబాబు, వస్కా ఉమేష్, గొడవర్తి కృష్ణకుమార్ పాల్గొన్నారు.

పెనుగొండ : మాజీ సిఎం జగన్ పుట్టినరోజు వేడుకలు గ్రామాల్లో నాయకులు ఘనంగా నిర్వహించారని వైసిపి మండల కార్యదర్శి తిక్కిరెడ్డి పావని అన్నారు. గాంధీ బొమ్మల సెంటర్లో కేక్ కట్ చేశారు. సిద్ధాంతం ఎంపిటిసి ఏడుకొండలు మాట్లాడారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. వారికి ఏలూరు జిల్లా ఆస్పత్రి ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ సర్టిఫికెట్లను అందజేశారు. అలాగే స్థానిక ఏరియా ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. పడాల వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కొట్టు సత్యనారాయణ మాట్లాడారు. రాష్ట్ర రాజకీయాల్లో జగన్మోహన్ రెడ్డి ఒక కొత్త అధ్యాయాన్ని సృష్టించారన్నారు. వైసిపి రాష్ట్ర రైతు విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురామ్ నాయుడు నివాసం వద్ద జగన్ పుట్టినరోజు వేడులకు నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డి రఘురామ్ నాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ముత్యాల ఆంజనేయులు, మాజీ కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొర్రెల శ్రీనివాస్ పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెం :రక్తదానం చేస్తున్న నేతలు

ఉండి: జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఉండి మెయిన్ సెంటర్‌లో వైసిపి మండల అధ్యక్షులు పివిఆర్‌కె.ఆంజనేయరాజు ఆధ్వర్యంలో వైసిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం వైసిపి గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షులుగా నియమితులైన ధనుంజయ, వైసిపి ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శేషాద్రి శ్రీనివాస్, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి సుందర్ కుమార్‌ను సన్మానించారు.

పాలకొల్లు : జగన్ పుట్టినరోజు సందర్భంగా వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ ఆధ్వర్యంలో గాంధీ బొమ్మల సెంటర్లో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ డిసిఎంఎస్ ఛైర్మన్ యడ్ల తాతాజీ, సీనియర్ నాయకులు గుణ్ణం నాగబాబు, కుమార దత్తాత్రేయ వర్మ పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో పట్టణ అధ్యక్షులు కుక్కల కృష్ణమోహన్ ఆధ్వర్యంలో అభిమానులు ఏర్పాటు చేసిన కేకును కోసి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పడవల సత్యనారాయణ, కర్రీ ఏసుబాబు, తన్నీడి గిరి, బొక్క నాగరాజు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - గణపవరం

స్థానిక డిగ్రీ కాలేజీలో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నిర్మలాకుమారి మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకల ద్వారా విద్యార్థుల్లో సమానత్వ భావాన్ని, ఐక్యతను అలవర్చుకోవచ్చన్నారు. ప్రపంచంలో సర్వమతాల సారం సమానత్వమేనని అన్నారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు కె.స్వరూపరాణి, కెవి.గణేష్, ఎన్‌విఎన్.శ్రీనివాస్‌రావు, జి.వెంకట్రావు, జివి శారదాదేవి పాల్గొన్నారు.

పాలకొల్లు : స్థానిక ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాల, కెవిఎం జూనియర్ కళాశాలలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఛైర్మన్ కెవిఆర్ నరసింహారావు ముఖ్యఅతిథిగా విచ్చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్రైస్తవ మిషనరీలు సమాజానికి విద్యా వైద్యం, పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అత్యుత్తమంగా నిలిచిందని చెప్పారు. ప్రతి విద్యార్థిలో క్రమశిక్షణ, సృజనాత్మకతను వెలుగు తీయడమే ఈ కార్యక్రమాలు ఎంతగానో దోహాతో పడుతున్నాయన్నారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వాల్గా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ సీతారామరాజు, ఎడ్యుకేషనల్ సొసైటీ కోసాధికారి ప్రవీణ్ భాను, అధ్యాపకులు పాల్గొన్నారు.

తణుకు : మనిషి మనస్సును జయించలేకపోవడానికి కారణం ఈర్ష్య, పగ, అహంకారమేనని రోమన్ క్యాథలిక్ మిషన్ ఫాదర్ ఎన్.బాలరాజు తెలిపారు. శనివారం ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల ఆవరణలో కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యు లక్ష్మీసుందరీబాయ్ అధ్యక్షతన యూత్ క్రిస్మస్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి మాట్లాడారు. కార్యక్రమంలో విజిఎస్ స్కూల్ సెక్రటరీ చిట్టూరి రీనాసాయి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బిహెచ్ హిమబిందు, కన్వీనర్ జి.అరుణకుమారి పాల్గొన్నారు.

నరసాపురం: మండలంలోని లక్ష్మణేశ్వరం సియోను ప్రార్థనా మందిరంలో మత్స్య కళాశాల విద్యార్థులు శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కీర్తనలు పాడుతూ యువతి, యువకులు ఆనందోత్సాహంతో నృత్యాలు చేసి అలరించారు. కార్యక్రమంలో పాస్టర్ కె.ఫ్రాన్సిస్ పాల్, మత్స్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఉండి:ఏసుక్రీస్తు చూపిన మార్గం అనుసరణీయమని ఉండి పిహెచ్‌సి డాక్టర్ బి.సాయి చంద్ర, డాక్టర్ లక్ష్మీ సునంద అన్నారు. శనివారం ఉండి పిహెచ్‌సిలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇతరుల పట్ల ప్రేమ, దయ, కరుణ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోండి : కలెక్టర్

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని జిలా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. నెలమూరులో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణతో హాజరయ్యారు. ఈ సందర్భంగా వచ్చిన వినతులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రజలకు క్షేత్రస్థాయిలో భూ సంబంధిత సమస్యలు వారి ప్రత్యక్ష హాజరు సమయంలో రికార్డులను పరిశీలించడం, వాస్తవ పరిస్థితిని వివరించడం జరుగుతుందన్నారు. వచ్చిన వినతుల్లో అవకాశం ఉన్నవాటిని తక్షణం పరిష్కరించాలన్నారు. రెవెన్యు సదస్సుల సమయంలో రికార్డుల పరిశీలనకు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని స్థానిక సిబ్బందికి ఆదేశించారు. ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజల భూ సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి ఆలోచన చేసి రెవెన్యూ సదస్సులకు సూచించడం జరిగిందన్నారు. జిల్లాలో డిసెంబర్ 13 నుంచి ప్రారంభించిన రెవెన్యూ సదస్సులు జనవరి 6 వరకూ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తాగు, సాగు, డ్రెయినేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రెవెన్యూ సభ అనంతరం జగనన్న కాలనీని ఎంఎల్ఎ కలెక్టర్‌తో కలిసి సందర్శించారు. కార్యక్రమంలో నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు తహశీల్దార్ వై.రవికుమార్, సర్పంచి కుచ్చర్లపాటి మంగతాయారు, ఎంపిడిఒ బివిఎస్‌వి.శర్మ పాల్గొన్నారు.


పెనుమంట్ర : రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఉండి:రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేవు కార్తీక్ అన్నారు. శనివారం చెరుకువాడ గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న రేవు కార్తీక్ మాట్లాడుతూ సర్వే నంబర్ల జారీ, ఇతర రెవెన్యూ సమస్యలు ఉంటే సభ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఇప్పటికే గత రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి తమ వంతు కృషి చేశామన్నారు. ఏవైనా సమస్యలుంటే సభ దృష్టికి తీసుకురావాలని, తక్షణం అధికారులు వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపడతారని సర్పంచి కొండవీటి సాంబశివరావు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ రత్నావళి, గ్రామ పంచాయతీ కార్యదర్శి సుభాషిని, గ్రామ రెవెన్యూ అధికారి ఎస్.గొల్ల, రైతులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : కూటమి ప్రభుత్వం తమది ప్రజా ప్రభుత్వమని చెబుతోందని, ఆ పేరును నిలబెట్టే బాధ్యత అధికారులపైనే ఉంటుందని ఎంఎల్ఎ, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. పెద్దతాడేపల్లిలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో వ్యవసాయం చేసుకునే రైతులు గొడవలకు ఇష్టపడరని అలాంటి వారిని అలుసుగా చేసుకుని వారి భూములను గత ప్రభుత్వంలో ఆక్రమించే చర్యలకు పాల్పడ్డారని తెలిపారు.అలాంటి వారిపై బిల్ లేకుండా కేసులు పెట్టే విధంగా చట్టం రూపొందించామని ఎంఎల్ఎ తెలిపారు. ఆక్రమణలకు గురైన రైతులకు అండగా ఉండేందుకు ఈ రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తమ సమస్యలు పరిష్కరించేందుకు అధికార ఆశ్రయించిన రైతులను గౌరవించే వారి పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచి పోతుల అన్నవరం, తహశీల్దార్ ఎం.సునీల్‌కుమార్, టిడిపి మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్, కార్యదర్శి రవిచంద్ర, ఎంపిటిసిలు గోవిందు, పసుమర్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆచంట :గత ప్రభుత్వం చేపట్టిన డ్రోన్ సర్వేలో చాలా పొరపాట్లు సరి చేయడమే రెవెన్యూ సదస్సు ఉద్దేశమని ఎఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. జిల్లాలో డిసెంబర్ 13 నుండి ప్రారంభించిన రెవెన్యూ సదస్సులు జనవరి 6 వరకూ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర నలుమూలల భూ యజమానుల భూ హక్కులను కాపాడి, రీ సర్వే లోని తప్పిదాలను సరి చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆచంట ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, సర్పంచి సరోజినీ, తహశీల్దార్ కనకరాజు పాల్గొన్నారు.

పెనుగొండ : భూ యజమానులకు భూ రక్షణ చట్టం తెచ్చింది కూటమి ప్రభుత్వమని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు శనివారం ఇలపర్రులో రెవెన్యూ సదస్సును ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమన్నారు. భూ హక్కుదారులకు భూ రక్షణ చట్టాన్ని తెచ్చిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వమన్నారు. సర్పంచి దండు పద్మావతి, తహశీల్దార్ అనితకుమారి పాల్గొన్నారు.

మొగల్తూరు : భూ యజమానుల సమస్యల పరిష్కార నిమిత్తం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహశీల్దార్ రాజ కిషోర్ అన్నారు. మండలంలోని మోడీ, వారతిప్ప గ్రామాల్లో శనివారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులో ఆరు వినతులు అందాయన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

ప్రజాశక్తి - భీమవరం టౌన్

బివి.రాజు ఫౌండేషన్, విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ భీమవరం వారి విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జాతీయ సేవా సమితి విభాగం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ప్రపంచ ధ్యాన దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ మంగం వేణు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని మొదటి సారి జరుపుతున్నామని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫ్యాకల్టీ కె.గోపాల శర్మ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.గంగరాజు, డీన్స్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : స్థానిక భవిత వికలాంగ శిక్షణా కేంద్రంలో ప్రపంచ ధ్యాన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఉపాధ్యాయుడు బాల ఈశ్వరయ్య మాట్లాడుతూ దినచర్యలో భాగంగా ప్రతిరోజూ క్రమం తప్పకుండా ధ్యానం, యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయిని ఎం.చంద్రకుమారి, జి.నాగలక్ష్మి, వికలాంగ పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాలకోడేరు : భీమవరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ పెన్నాడ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రపంచ ధ్యాన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కొప్పర్తి సురేష్ మాట్లాడుతూ ధ్యానాన్ని మనిషి జీవన విధానంలో ఒక భాగంగా చేసుకుంటే ఎటువంటి ఆరోగ్య మానసిక సమస్యలు లేకుండా జీవించవచ్చని అన్నారు. అనంతరం విద్యార్థులకు ధ్యానంలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎబిఎస్ఆర్ మనోహర్, అకడమిక్ డీన్ డాక్టర్ కురెళ్ల భాస్కరరావు పాల్గొన్నారు.

మొగల్తూరు : ధ్యానంతో మానసిక ప్రశాంతత ఆరోగ్య సమతుల్యతకు దోహదపడుతుందని హార్ట్ ఫుల్ నెస్ మెడిటేషన్ సెంటర్ మొగల్తూరు నిర్వాహకులు తుంపూడి మల్లేశ్వరరావు అన్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని వాసవీ ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద హార్ట్ ఫుల్ నెస్ మెడిటేషన్ సెంటర్, ఆర్యవైశ్య సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంక ముత్య రామ నాగేశ్వరరావు, ఆకుల స్వామి, పొన్నపల్లి త్రినాథ్, కొవ్వాడ రాజా పాల్గొన్నారు.

నరసాపురం : సమాజంలో శాంతికి ధ్యానమే ఏకైక మార్గమని సీనియర్ పిరమిడ్ మాస్టార్లు కృష్ణవేణి, స్వర్ణలత అన్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వైఎన్ కళాశాల పిరమిడ్ సెంటర్లో పట్టణ, మండలానికి చెందిన ధ్యానులు సమావేశమయ్యారు. అనంతరం విచ్చేసిన ధ్యానులను ఉద్దేశించి మస్టార్లు మాట్లాడారు. కార్యక్రమంలో నాగమల్లేశ్వరరావు, ఎస్. భాస్కరరావు, మహేష్, ప్రకాశం, శశికళ, మురళీ పాల్గొన్నారు.

తణుకు : విద్యార్థులు చిన్న వయస్సు నుండే ధ్యానం దినచర్యలో భాగంగా మార్చుకోవాలని మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, డివైఇఒ డి.మురళీసత్యనారాయణ అన్నారు. మాంటిస్సోరి స్కూల్ ఆవరణలో ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జ్ఞానమంజరి, ప్రధానోపాధ్యాయిని లక్ష్మి, ప్రగతి కాలేజ్ డైరెక్టర్ ఎంఎస్ఆర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

ఫెర్రీ రేవు బకాయి రూ.40 లక్షలు చెల్లింపు

ప్రజాశక్తి - నరసాపురం

ఫెర్రీ రేవు పాటదారుడు రెడ్డప్ప ధవేజీ చెల్లించాల్సిన రూ.53 లక్షల్లో రూ.40 లక్షలు శనివారం చెల్లించారు. ఇంకా సుమారు రూ.13 లక్షలు బకాయి ఉంది. ఎంపిడిఒ ఎం.వెంకట రమణరావు ఆత్మహత్యకు, ఫెర్రీ రేవు బకాయి సంబంధం ఉందని ఆరోపణలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. అయితే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడటం వల్లే ఎంపిడిఒ ఆత్మహత్యకు పాల్పడినట్లు తేలడం, ఆపై ధవేజీ బకాయి చెల్లింపునకు ముందుకు రావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

టెక్నాలజీతో హార్టికల్చర్‌లో లాభాలు

పాలకోడేరు : టెక్నాలజీని వ్యవసాయ రంగంలో కూడా వినియోగిస్తే హార్టికల్చర్ కూడా అభివృద్ధి చెంది ఆర్గానిక్ ఉత్పత్తులు మార్కెట్లోకి వస్తాయని ప్రముఖ సాంకేతిక నిపుణులు ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు అన్నారు. కళాశాల టెక్నాలజీ సెంటర్, ఐడియా ల్యాబ్ సంయుక్తంగా డిజైన్ థింకింగ్ అండ్ ఇన్నోవేషన్ అనే అంశంపై ఐదు రోజుల పాటు అధ్యాపక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముగింపు సందర్భంగా శనివారం మోగల్లులో కళాశాల డైరెక్టర్ జగపతిరాజు తన వ్యవసాయ క్షేత్రంలో టెక్నాలజీని ఉపయోగించి హార్టికల్చర్, అగ్రికల్చర్ ఏ విధంగా సాగు చేస్తున్నారు స్వయంగా చూపించారు. ఈ సందర్భంగా జగపతి రాజు మాట్లాడుతూ కళాశాలలో ఉన్న సెల్ ఫోన్ టెక్నాలజీ ద్వారా మోటార్లు ఆపరేట్ చేయడం జరుగుతుందన్నారు. టెక్నాలజీ సెంటర్ హెడ్ డాక్టర్ ఎన్.గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ డిజైన్ థింకింగ్ ఇన్నోవేషన్ ఆలోచనలు ఎలా ఆచరణలో పెడుతున్నారు స్వయంగా పరిశీలించేందుకు వ్యవసాయ క్షేత్రం సందర్శించడం జరిగిందన్నారు. ట్రెయినింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్ డీన్ డాక్టర్ కెఆర్ సత్యనారాయణ, డీన్ అకాడమిక్స్ డాక్టర్ వి.చంద్రశేఖర్‌తో పాటు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

టిడిపిలోకి ఎన్ఆర్‌పి అగ్రహారం సర్పంచి

ఉండి:మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామ సర్పంచి సురవరపు కనకదుర్గ వెంకటాచార్యులు దంపతులు శనివారం ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు సమక్షంలో టిడిపిలో చేరారు. వారికి పార్టీ కండువా వేసి రఘు రామకష్ణంరాజు సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా సురవరపు కనకదుర్గ వెంకటాచార్యులు మాట్లాడుతూ పార్టీలకతీతంగా తమకు గుర్తింపునిచ్చి గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న ఎంఎల్ఎ పాలన పట్ల ఆకర్షితులైన తాము తమ అనుచరులతో టిడిపిలోకి చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు వెంకటేశ్వరరాజు, తక్కెళ్ల నరేష్ పాల్గొన్నారు.

మార్రాజు ఎన్నిక పట్ల హర్షం

నరసాపురం:పశ్చిమగోదావరి జిల్లా డెల్టా ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షులుగా జనసేన నాయకులు గుబ్బల మార్రాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బొమ్మిడి సునీల్, జనసేన నాయకులు ఆకన చంద్రశేఖర్, వలవల నాని, బందెల రవీంద్ర, నిప్పులేటి తారకరామారావు, గంట కృష్ణ మార్రాజుకు శుభాకాంక్షలు తెలిపారు.

మాంటిస్సోరిస్ విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ పాఠశాలలో సబిత ఉమెన్స్ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు ఐదు విభాగాలుగా ఏర్పాటు చేసిన గణితశాస్త్ర క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ ఎస్.వసంతలక్ష్మి, గణితశాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పులామలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపల్ ఎస్.వసంతలక్ష్మి మాట్లాడుతూ ఇటువంటి క్విజ్ పోటీలు పెట్టడం వల్ల విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయవచ్చన్నారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి

నరసాపురం:విద్యుత్ చాలా విలువైందని, వృథా కాకుండా పొదుపుగా వాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఆర్‌డిఒ దాసిరాజు పిలుపునిచ్చారు. జాతీయ విద్యుత్ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఇపిడిసిఎల్ ఇంజినీరింగ్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. వారం రోజులుగా విద్యుత్ పొదుపుపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, ముగ్గులు పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి సర్టిఫికెట్లు, షీల్డ్‌లు అందించి మాట్లాడారు. విద్యుత్ ఒక నిత్యావసర వస్తువుగా మారిందన్నారు. కరెంట్ లేనిదే ఉండలేని పరిస్థితి నెలకొందన్నారు. జల విద్యుత్, ధర్మల్ విద్యుత్ చాలా ఖర్చుగా మారాయన్నారు. నరసాపురం ఇఇ కె.మధుకుమార్ మాట్లాడుతూ సోలార్ విద్యుత్ వాడకాన్ని పెంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అనేక సబ్సిడీలు ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో ఎడిఇలు ఓంకారం, రామకృష్ణ ఎఇలు ప్రభాకర్, వెంకట్రావు, సిబ్బంది సురేష్ బాబు, వినయ్, పోలరాజు, కిషోర్, మధు, కళ్యాణ్ పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం గ్రామం కు చెందిన మల్లి మోహన రావు గారి పేరు మీద గల **6929/2018** దస్తావేజు కు **6472/2016 & 7890/2010** లింక్ దస్తావేజుల ఒరిజినల్స్ పోయినవి. దొరికినవారు ఈక్రింది అడ్రస్ నందు అందించ గలరు. మల్లి సరళ కుమారి W/o. మల్లి మోహన రావు, కొడాలివారి వీధి, బైబిల్ మిషన్ చర్చ్ దగ్గర, జంగారెడ్డిగూడెం - 534447, సెల్: **9440066114**.